## కథ

# కమనీయం

**యస్. చిట్టిబాబు**

ఇంటర్వెల్‌లో అటూ యిటూ చూస్తూ అవతల కార్నర్‌లో వంటరిగా కూర్చున్న వో అమ్మాయినన్నే చూస్తున్నట్టు గమనించాను. తెలిసిన ముఖంలా కూడవుంటే, లేచి నిలబడి పరిశీలనగా చూసి ఆశ్చర్యపోయా. ఎవరో కాదు, వేషంలో దొంగవెధవ, మా శీను. మూడేళ్ల క్రిందట మా కాలేజీలో ఆడవేషానికి వెండికప్పు గెలిచినవాడు. నేను ఫుట్‌బాల్ కేప్టన్, వాడునాటకాల్లో హీరోయిన్, మా సరదా అల్లర్లువుండేవి. రెండేళ్లనుంచి మేంకలవలేదు. నాజూనియర్.

ఓసారి కాలేజిరోజుల్లో ఫ్యాన్సీడ్రెస్ ప్రోగ్రామ్‌కు వేరే పని చూసుకుని వెళ్లడం, హాలు నిండివుండటం వల్ల, డోర్ బయట, జనంలో నిలబడి స్టేజివంక చూస్తున్నా, వెనకయెవరో నవ్వుతూ గోలగావుంటే అటు చూశా. మిసమిస లాడుతూ యౌవ్వనంలో వున్న వో ముష్టి పిల్ల, యెగుడు దిగుడు పరికిణీ, జాకెట్టు, చిరుగులున్నవల్లెతో పరిగెత్తుకుంటూవచ్చి నా చెయ్యి లాగి తన చెయ్యి జాపింది. ముట్టుకొన్నందుకు అసహ్యించుకుంటూ, అప్పుడక్కడ గొడ వెందుకని, ప్యాంటు పాకెట్‌లోంచి వో పావలాబిళ్ల తీసి దాని చేతిలో పెట్టాను. ప్రక్కవాళ్లు నవ్వుతుంటే "నేను శీనూను ప్రసాద్" అని నవ్వుతూ గ్రీన్‌రూమ్ వైపు పరుగెత్తాడు. నేనక్కడికి వెళ్లక పూర్వం, వాడు, యింకోఫ్రెండ్ ముసలి తాత వేషంలోను కలిసి హాల్లో ముందువరస పెద్దల దగ్గిర ముష్టె త్తారట!

అటు తర్వాత కాలేజీలో రెండు నాటకాల్లో హీరోయిన్ వేషం వేసి కూడా గొప్పగా నటించాడు. కొందరు ఆడ వేషాలు వేసే నటులకు ఆదోసరదా, యెవరూ గుర్తుపట్టలేనట్టు మామూలు మనుష్యుల మధ్య వేషంతో తిరగాలని, శీనుకు గూడ అట్లాగే బుద్ధి పుట్టి యివాళ యిట్లా వచ్చాడనిపించింది, సంతోషంతో వాడి దగ్గరకెళ్లి నవ్వుతూ ఆముఖం చూస్తూ వుంటే, లైట్లుపోయి తెరమీద అడ్వర్టయిజుమెంట్లు వచ్చినై.

వాడు తొణకటం బెణకటం చేయకపోగా, రెండునిమిషాలు గడిచిన తరువాత "యెందుకట్లా చూస్తున్నారండీ?" అన్నాడు, శ్రావ్యమైన స్త్రీకంఠ స్వరంతో వేషంగదా, మరి ఆడపిల్లనని నన్ను నమ్మించాలి!

"నీ వేషాలు తెలుసులే శీనూ!" అంటూ భుజంమీద చేత్తోనొక్కి ప్రక్కసీట్లో కూలబడ్డా.

"మీరెవరో నాకు తెలియదు. నేను యే శీనూను కాదు. మాక్లాస్ మేటు వస్తానని, యెందుకో తెలియదు, రాలేదు. ఆ సీటులో మీరు కూర్చున్నా, నాకు అభ్యంతరం లేదు. మార్యాదగా మాత్రం చేతులు దగ్గర పెట్టకొండి", అన్నాడు హూందాగా, గొప్పింటి పిల్లలా. వాడట్లా నటిస్తూవుంటే నేను తక్కువా, యస్.ఐ.గా సెలక్టయి ట్రయినింగ్‌కు వెళ్లబోతున్నవాడిని, వాడిని దభాయిద్దామనిపించింది.

"నేను మఫ్టీలో యస్.ఐ.ని ఎవరినో యీవేషంతో మోసం చేయటానికి వచ్చినందుకు నిన్ను తీసుకెళ్లి యింటరాగేట్ చేయాలి.

"అట్లాగే చేద్దురుగాని, సినిమా అయింతర్వాత, ముందు సినీమా చూడనివ్వండి. మీరు కూడా చూడండి", అన్నాడు సలహాకూడయిస్తూ.

నాకూ సినిమా చూడాలనే కుతూహలంగా వుంది. "సరే", అన్నా తెరమీద 'శుభం' అని రాగానే వాడులేచి "పోదాంరండి. మీతో వస్తున్నా", అన్నాడు. ఇంకా యేంచేస్తాడో చూద్దాం అనుకుంటూ వాడిననుసరించా.

"ఓనూట యాభై గజాల్లోనే మాయిల్లు, మంచి కాఫీతాగి స్టేషనుకు వెడదాం", అంటూ వాడు నడుస్తూవుంటే, ఆవయ్యారం, ఆ నడక తీరు, గుండెధైర్యం ఆడపిల్లలా మాటలు, నామనసులో కాస్త అనుమానం కలిగించినై. ఆ వ్యక్తి నిజంగానే అమ్మాయేమోననే బెరుకుయేర్పడింది. వాడి పోలికలున్న అమ్మాయి కావచ్చు, ఒకే పోలికలతో మగవాళ్లు ఆడవాళ్లు కూడ వుంటారాయెను అని అనిపించిందప్పుడు.

పనిమీద ఈవూరొచ్చిన వాడ్ని, అవగానే తిరిగివెళ్లడానికి బస్సు అందక, ట్రయినులేక, వుండాల్సొచ్చి, తోచక సినిమాకు రావటం, యీతంటా తెచ్చి పెట్టుకోవటం యేమిట్రా భగవంతుడా అనిపించింది.

ఎందుకైనా మంచిది, నేను పొరబాటు పడ్డానని విచారం వ్యక్తం చేసి, లేని పోని యీతద్దినం వదిలించుకుంటే బాగుండునని పించింది. కాని వెంటనే మళ్లీనేనంత బలహీనుడుగా బయటపడటానికి అహం అడ్డుపడింది. అట్లా చేస్తే ఆమెకు చులకనైపోయి, ఆమె దూషణలకు తలవొగ్గాల్సొస్తుందేమో అనుకున్నా, ఇంకో రెండు ఆలోచనలు కూడవచ్చినై.

కొంపతీసి యీ అమ్మాయి యేకాల్ గర్లో అయి, వాళ్లింట్లోకి వెళ్లీవెళ్లగానే సమదానాలతో మభ్యపెట్టి, నేను లొంగక పోగానే, నా నిజస్వరూపం తేల్చి, అల్లరో, యింకే పెద్ద శిక్షో వేయవచ్చు.

రెండోది, ఆమె నిజంగా గౌరవకుటుంబంలోని అమ్మాయే అయితే, వాళ్లపెద్ద వాళ్లచేత ముందు చివాట్లు యినా, తరువాత నా విషయం తెలియగానే, మంచికాఫీ కూడ గ్యారంటీ అనిపించింది.

అంతలో ఆమెనడకఆపి, స్వగౌరవరాయల్‌వుయ్ 'భాషలో, "ఇదేనండి మనయిల్లు", అని హూందాగా గేటు తెరిచి లోపలికి దారితీస్తుంటే, గేటు ప్రక్కన గోడకున్న 'అడ్వకేటు' బోర్డు కనిపించి, నేను కంగారుపడుతూనే ఆమెనను సరించా. నిజానికి ఆమె 'మనయిల్లు' అన్నప్పుడు, అది మా యిద్దరి యిల్లు అయితే అదృష్టం అని సరదాగా అనిపించింది.

ఆమె కాలింగ్ బెల్ నొక్కగానే వొక నడివయసావిడ "మీ మామయ్య యిప్పుడే లోపలికొచ్చారంటూ డోరు తెరచివెళ్లింది.

ఆఫీసుహాల్లో నన్ను కూర్చో బెట్టి, ఆమెవొక ర్యాకులోంచి వొక మ్యాగజైను తెచ్చిచ్చింది. "ఇది చూస్తూవుండండి. కాఫీ తెస్తా" నంటూ

పది నిముషాలయిం తర్వాత, ట్రేలో మూడు కప్పుల్తో వస్తూ, వెంటవస్తున్నాయనను "మా మామయ్య గారు, అడ్వకేటు" అని చెప్పి ట్రే టేబులు మీద పెట్టింది. నేను లేచి నమస్కారం చేయటం, ఆయన తన రివాల్వింగ్ చైరులో కూర్చుంటూ, దీవిస్తున్నట్లు చెయ్యి అడించి కూర్చోమనటం జరిగింది. ఆమె నాకు, ఆయనకు చెరోకప్పు యిచ్చి, తను మూడోకప్పు తీసుకొని, ఆయన ప్రక్క కూర్చీలో కూర్చుంది. ఆయన సైగతో మేము కాఫీలు తాగాం.

ఆయన మర్యాద పలకరింపుగా, "నీ పేరేమీటిబాబూ? ఏ ఊరు? నాన్న గారి పేరు? వారేంచేస్తుంటారు? ఏ పేటలోవుంటున్నారు?" అంటూ వరుస ప్రశ్నలు వేస్తూవుంటే, నేను వాటికి వెంట వెంటనే సమాధానాలు చెప్పా. నాకు కొద్దిగా ధైర్యం వచ్చింది.

ఆమె కుతూహలంగా వింటూ, పెదిమెలబిగుతులో చిరునగవు దాచుకొంటుంటే, అందానికి తోడు చిలిపితనం కనిపిస్తోంది.

ఆయన రెండు నిమిషాలు ఆలోచిస్తున్నట్లాగి. "యేమయ్యా! ఆడపిల్ల ఒంటరిగా కనిపించిందని, వేషం వేసుకుని మోసానికి తయారయ్యావు. తీసుకెళ్లి యింటారాగేట్ చెయ్యాలన్నావుట?" అన్నారు, ముద్దాయికి ప్లీడరు ప్రశ్నలాగే.

"అన్నానుగాని. అమర్యాదగా యేమీప్రవర్తించలేదండీ", అన్నా. ఆమె నవ్వుముఖంలో అభయముద్ర కనిపిస్తోంది.

"ఎందుకుగాని స్టేషన్‌కు ఫోన్ చేస్తా. యిద్దరూ వెదుదురుగాని. ఏం జరుగుతుందో చూస్తారు", అని బెదిరిస్తూ ఫోన్ తీశారు.

"అంతదాకావద్దులే మామయ్యా", అంది ఆమె కాస్త కంగారుగా, నా మీద జాలిలాగా ఆయన ఆమెవంక సీరియస్‌గా చూస్తూ", కేస్ అప్పచెప్పటం, విత్‌డ్రా చేసుకోవటం నీయిష్టమేనన్నమాట. కాంప్రమైజ్ కాదుగా? సాఫ్ట్‌కార్నర్", అని, తరువాత నావంక కనుబొమలెగరేస్తూ చూశారు, గర్వంగా. "అదేంకాదు..." ఆమె నాన్చటం మొదలెట్టింది.

"మరియింటికి రాగానే యేదోఘోరం జరిగినట్టు మొహం పెట్టావు, బెదిరించాడు, అవమానించాడు అన్నావు. ఈ కేసు పోలీసులకొద్దులేగాని, అతని పెద్ద వాళ్లకే రిపోర్టు చేద్దాం, నేనే వెళ్లిచెప్తా, మీ అబ్బాయి బెదిరింపులకు మామేన కోడలు అమితంగా దుఃఖిస్తోంది. మీరొచ్చి చూసి, ధైర్యం చెప్పండి. మీ అబ్బాయికి తగిన శిక్ష వెయ్యండి", అని అంటూ వుంటే

"ఏమిటి మామయ్యా నన్నల్లరి చేయటం", అంది బుంగమూతి, బుగ్గలెరుపుతో

నాధైర్యం ఆనందంగా మారి. దాన్ని గుండెల్లోంచి హృదయంలోకి నెట్టుకున్నా

మళ్లీ ఆయన, "వాళ్ళొచ్చినప్పుడు పెళ్లికూతురులా ముంగిగానే కూర్చోక, అంతా చెప్పు. వాళ్లు అనేదేమిటో, మీ అమ్మానాన్నలకు తెలియచేస్తానంటూ, శీనూ పైలెట్ ట్రయినింగులో వున్నాడాయె, వాడి రిపోర్టు వస్తుందిలే, సపోర్టు చేస్తూ", అంటూ ఆమె వంక చూశారోలేదో, వెంటనే ఆమెలేచి", నీతో చెప్పటమే పొరబాటు," అంటూ లోపలికి తుర్రుమంది.

ఆయన నవ్వుతూ నావంక చూశారు.

అంతా అర్థం చేసుకున్న నేను లేచి "వెళ్లొస్తానండీ", అని నమస్కరించి కదిలా, హుషారుగా. ఆయన, "మంచిదినాయనా" అని నాతో అని, "సుందరీ! అతను వెడుతున్నాడు గాని, వెళ్లగానే గేటు తాళం వేసిరా", అని మేన కోడల్ని పురమాయించారు.

గేటు దగ్గర "మీఫొటోలు అన్నయ్య కాలేజీ మ్యాగజైన్లలో చూశానండీ", అంది కొంటెగా నవ్వుతూ.

"శీనూ అని సినిమాహాల్లో నేను అనగానే అర్థం చేసుకుని, తెలిసే నాటకం ఆడావన్నమాట" అన్నాను.

"అప్పుడే యీ సంగతి చెప్తే, 'సారీ' చెప్పి మీ సీట్లోకి మీరు వెళ్లి, సినిమాకాగానే మీ దారిన మీరు వెళ్లేవారు", అంది ముత్యాల నవ్వుతో.

"ఇప్పుడు నీ దారికి వచ్చానంటావు. ఐలవ్‌యూ", ఆలస్యం యెందుకని ఆగలేక చెప్పేశా. గేటుకిరువైపులా లైట్లకాంతిలో ఆమె సౌందర్యం వెలుగులు జిమ్ముతుంటే, "ఐటూ", అంది తలొంచుకుంటూ, తాళంవేస్తూ.

# సందేశ భ్రమరాలు

మంచె మీద బూజుకర్ర
అవసరానికి అందినట్లు
రంగుల స్వాగతం
పదే పదే పలకరిస్తుంది.
నూలు పొట్ట కొట్టి,
కుంచె నడ్డి విరిచిన
ప్లాస్టిక్ గుడ్డలు
జన ఉద్యమసూచికలయ్యాయి.
విడుదలకు ముందే
తడి వత్తని బట్టలు కట్టే
సినిమా పేరంటాళ్లు
పాల స్నానాలు చేయిస్తున్నారు.
కూడలి కొమ్మల్లో
సబ్బు రుద్దు చిత్రాలు
శృంగారం ఒలకబోస్తున్నాయి.
గాంధీ చరఖా - కాటన్ మొలకను
మరిపించిన చైనా యంత్రం
చేతులు కట్టి, సిగ్గును చంపి,
వేసింది వినైల్ మంత్రం!
గొప్ప కోసం తపిస్తున్న తరం
మరిచిందో సత్యం.
అధికార గమనిక, నాయకుల గమనపు
భావావేశ పతాకాలన్నీ - రోజు గడిస్తే
వెల వెల పోతున్నాయి నిత్యం.

- బరకు